# మైకు

పుస్తకం తీసి  పది నిమిషాలైనా కాలేదు, మైకులోంచి సినిమా పాటలు ప్రారంభమయ్యాయి చదివిందే చదువుతున్నాడు తప్ప  చదువుతున్న అక్షరాల్లోని సారాంశం, తలకెక్కడం లేదు.

లేచి కిటికీ తలుపులన్నీ మూసేస్తే ఉక్క– లోపల వుండటం కష్టం.

పరిక్షల రోజుల్లోనే - సంబరాలు, పెళ్ళిళ్ళు.

మైకు పెట్టాలంటే పెళ్ళిళ్లే కానక్కర్లేదు బారసాలకి, సమత్తకి, ప్రదానానికి కీల్లీ బడ్డీల ప్రారంభోత్సవాలకి, పండగలకీ, గృహప్రవేశాలకి - ప్రతీదానికి మైకు. గట్టిగా తుమ్మితేచాలు మైకు.

పూర్వం కథాకార్యం జరిగితే పదిమందికి తెలిసేందుకు మంగళ వాయిద్యాలు మ్రోగించేవారు. ఒక మనిషి చచ్చి పోతే , చచ్చి పోయాడు సమా అని  పదిమందికి తెలిసేందుకు చావు బాజా వాయించేవారు. సరిగ్గా అందు కోసమే కాక పోయినా మంగళవాద్యాలు అందుకే ప్రారంభమయి వుంటాయి. సమాజం బాగా మారింది. వాయిద్యాల బదులు మైకులు, స్టీరియోలు వచ్చాయి ఎలక్ట్రిక్ వికాక ఎలక్ట్రానిక్‌వి వచ్చాయి. చెవులు పగిలి పోతున్నాయి. ధ్వని కాలుష్యం ఎక్కువయింది.

అరగంటయింది. లాభంలేదు. ఒక్క పేజీ ముందుకు కదలలేదు. ఏం చెయ్యడం ? ఈ రాత్రికి ఎలాగన్నా ఈ చాప్టరు పూర్తి చేద్దామనుకుంటే కుదరేలా కనిపించడం లేదు.

సెప్టెంబరు, అక్టోబరు పరిక్షల సమయంలో దసరా పండగ, సంబరాలు , అయ్యప్ప భజనలూ ఉంటాయి. ఆ రెండు నెలలూ మైకు హోరు జోరుగానే వుంటుంది రూలుప్రకారం రాత్రి తొమ్మిది తరువాత మైకు పెట్టకూడదట ఎవరు పాటించడంలేదు ఎవరిష్టం వాళ్లది. కమ్యూనిస్టు పార్టీవాళ్లుగాని రాడికల్ స్టూడెంట్స్ గాని మైకు పెట్టి మీటింగ్ పెట్టాలంటే పర్మిషన్ కావాలి యువజన సంఘాలు, మహిళా సంఘాలు, కార్మికసంఘాలు మైకు పెట్టాలంటే పర్మిషన్ కావాలి. నల్లదుస్తుల భక్తులు కాషయ దుస్తుల భక్తులు అర్ధరాత్రి అపరాత్రి అనకుండా మైకు పెట్టి చెవులు చిల్లులుపడేలా  ప్రజల ప్రాణాలు తోడేస్తుంటే ఎవరి పర్మిషను అక్కర్లేదు. గుంపులుగుంపులుగా రోడ్డుకి అడ్డం పడి భజనలు చేస్తూ అరుపులు అరవడానికి ఏ పర్మిషను అక్కర్లేదు. వీధుల్లో అడ్డంగా స్తంభాలు పాతి పందిళ్లువేస్తే ఏ పర్మిషను అక్కర్లేదు వామపక్ష భావాల వాళ్లు ఎంత క్రమశిక్షణతో మెలిగినా మైకు పెట్టాలన్నా మీటింగు పెట్టాలన్నా పర్మిషను కావాలి వామ పక్షాలవాళ్లు ఈవ్యవస్థలోని అసమానతలకు అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడుతారు . ప్రశ్నించి నిలదీస్తారు.  భక్తబృందాలు భజన సంఘాలు మూఢ నమ్మకాల్ని మరింత వ్యాప్తిచేసి ఈ దోపిడీ వ్యవస్తను మరింత గట్టి పరుస్తాయి. అదేతేడా.

ఆలోచనలతో తల పగిలి పోతోంది.

ప్రస్తుతానికి పడుకొని అలారం పెట్టుకొని తెల్లవారు జామున లేస్తే మంచిది అప్పుడు మాత్రం ఏ మూలనుంచో మైకు చెవులు పగలగొట్టదని నమ్మకం ఏమిటి?

కరెంటు పోతే బాగుణ్ణు కొవ్వొత్తి పెట్టుకొని చదువుకోవచ్చు.  చిదంబరం లైటు తీసేసి అసహనంగా మంచం మీద వాలాడు.

అవతల యింట్లో -

నిద్రపట్టడంలేదు. పదకొండు దాటింది, చెవులు పగిలి పోతున్నాయి. గత రెండురోజుల్నించి

వాంతులు, విరోచనాలు .. నీరసం... ఒకటే నీరసం ... నిద్దరలేదు తిండిలేదు. ఇవాళ కాస్త నిమ్మళించింది. సాయంత్రం తేలికగా ఇంత చారు, అన్నంతిని మాత్ర వేసుకొని పడుకుందామనుకుంటే , ఎవడో మైకు పెట్టి ప్రాణాలు తోడేస్తున్నాడు ఏం చెయ్యడం ?

వెళ్లి - ఆమైకు కాస్త పక్కకు తిప్పమని బతిమాలుకుంటే - వినరు .ఇంతకు ముందు ఆ పని అయింది ఆపక్క కూడా వుందట. ఇక ఎటు తిప్పమన్నారు అని అడిగారు కనుక భరించడమే చచ్చినట్లు.-

బావుంది వరస - మీ యింట్లో కథా కార్యం వస్తే మా చెవులు పగల గొడతారా ? నాకే గనక అధికారం వుంటే - పలానా ఇంత శబ్దాన్ని మించకూడదు రాత్రి తొమ్మిది తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ శబ్దంచేయకూడదు. అని రూల్స్ ఖచ్చితంగా అమలు పరిచి వుందును.

అమ్మా - అబ్బా - నీరసం - కాళ్ళు పీకులు కళ్లమంట. ప్రకాశరావు కళ్లమూసుకొని చెవులు చుట్టూ తువ్వాలు చుట్టుకొని పడుకొన్నాడు. ప్రకాశరావు అరవై ఏళ్లుదాటిన రిటైర్డ్ ఉద్యోగి, ఏకాకి.

తెల్లవారుజాము నాలుగున్నరకి అలారం మోగింది

చిదంబరం కళ్లు నులుముకొని లేచాడు. మైకు విని పిస్తోంది ఈ సారి కుడివైపునుంచి.... భక్తి గీతాలు ...... విని విని విసుగెత్తి పోయింది ....

ఇలాగే గావును జనాల్ని మార్చేస్తారు ఒకసారి కాదు వందసార్లుకాదు వేల లక్షలసార్లు చెవిలో పోరితే ఆ మాటలే వస్తాయి. మరొక మాట వినపడకుండా ఏళ్ల తరబడి జీవితాల తరబడి ఆ మాటలే ఆ పాటలే వింటే అవే వంట బడతాయి ఆ భావాలే వస్తాయి ! భక్తి భావాలు అలాగే ప్రచారం చేస్తారు భక్తీ వినయం బానిసత్వ లక్షణాలు.......

తెల్లవారు జామున లేచి జనమాట్యమండలి పాటలు పాడుతూ డప్పుకొడుతూ జనాల్ని మేలుకొలిపితే ...! పర్మిషన్ తీసుకొని పాడినా ఊరుకోవడంలేదు పోలీసులు. ఒకోసారి ఇచ్చిన పర్మిషన్ కేన్సిల్ చేస్తున్నారు.

ఆ మధ్య మాడుగులలోనూ వడ్డాది లోనూ జననాట్యమండలి వాళ్లని కేవలం పాటలు పాడుతున్నందుకేకదూ మక్కలిరగదన్నారు ? ఓట్లు వెయ్యొద్దన్నారు. ఎన్నికలు బహిష్కరించమన్నారు. పాలక వర్గ పార్టీల అక్రమాలన్నీ బయటపెడుతూ పాటలు పాడారు.

వంగపండు గద్దర స్థాయి కళాకారులకే ఒకోసారి నిర్బంధాలు తప్పనప్పుడు మామూలు కార్యకర్తల సంగతులు వేరే చెప్పాలా !

భక్తులు ఎంత న్యూసెన్సు చేసినా పరవాలేదు ఫర్మిషను అక్కరలేదు. ఈ మధ్య పోలీసుల్లోనూ నల్లదుస్తుల భక్తులు కాషాయ దుస్తుల భక్తులు బయలు దేరారు. ఖాకీకీ కాషాయానికీ పెద్ద తేడా లేదు స్వభావంలో.

పరిక్షలు నిండా నెలరోజులుకూడా లేవు. ఏం చెయ్యడం? వారం పదిరోజులలో వస్తానని రూంమేటు వాళ్లవూరు వెళ్లాడు.

పరిక్షచదువుల సంగతి అలా ఉంచి - అనారోగ్యంతో ఉన్న వాళ్లంటారు మరి వాళ్లసంగతేంకావాలి.? ఛీ ఛీ ఛీ కరెంటు పోతే బాగుణ్ణు. తన పిచ్చి గాని కరెంటు పోతే బాటరీ పెడతారు కలిగినవాళ్లు జనరేటర్లుపెడతారు. కరెంటు పోవడం పరిష్కారం కాదు.

మొత్తం ఈ దోపిడి సంస్కృతిలో మార్పురావాలి. ఈ భక్తి సంస్కృతి ,వ్యాపార సంస్కృతి, దోపిడీ సంస్కృతి, సామ్రాజ్యవాద సంస్కృతి పోవాలి. షోషలిజం రావాలి నూతన ప్రజాస్వామ్యం రావాలి.

బాగుంది మీరైతే అంతవరకూ ఈ గోల భరిస్తామా ?

భరించం. ఒకపక్క మైకుల్నేకాదు అన్నిరకాల అక్రమాల్ని ఎదుర్కొంటాం. మరొకపక్క విప్లవం విజయవంతం కావడానికి కృషిచేస్తాం. పోరాడే వాళ్ల పోరాడుతుండగా జననాట్యమండలి పాటాలో దళిత గీతాలతో భావప్రచారం చేస్తాం. రెండూ పక్కపక్కనే జరుగుతూ ఉండవలసిందే బలమైన ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతి నిర్మించి విప్లవానుకూల వాతావరణం సృష్టించవలసిందే.

ఇక ఎలాగూ నిద్రపట్టదు, చదువూ సాగదు వంగపండు పాటల కాసెట్ తీసి పెట్టి, మొహం కడుక్కోవడం ప్రారంభించాడు. క్రమంగా చీకట్లు తగ్గి వెలుతురు వస్తున్నది.

"జ్ఞాన మొక్కడి సొత్తుకాదన్నా
అది సర్వజాతుల సంపదోరన్నా"

ఈ పాటంటే చిదంబరానికి చాలా యిష్టం కొంచెం సౌండు పెంచాడు

" బాబూ ఆ సౌండుకాస్త తగ్గిస్తావా"

అవతలి యింటి ప్రకాశరావు కేక వేస్తున్నాడు.

చిదంబరానికి చిర్రెత్తుకొచ్చింది. కొంచెం సీరియస్ గానే, "ఒకమాట అడుగుతాను - ఏమీ అనుకోరుగదా - " అన్నాడు

"ఏమిటి?" - అన్నట్టుచూశాడు ప్రకాశరావు

" ఇంతకుముందు ప్రతీరోజూ భక్తి పాటలు,సినిమాపాటలు అర్ధరాత్రి అపరాత్రి లేకుండా వేశారు ఈ చుట్టుపక్కల. కనీసం ఒక్కసారయినా మైకు సౌండు తగ్గించమని అడిగారా - ?"

" అదేంటి అది శుభకార్యం. ఆ పాటలు ఈపాటలు ఒకటేనా ?"

" శుభకార్యం అయితే ఎంతసేపు న్యూసెన్సు చేసినా తప్పలేదు. అయ్యప్పపాటలు భగవద్గీత శ్లోకాలు ఎన్నిసార్లు ఎంతసౌండుతో పెట్టి చెవులు పగులగొట్టినా తప్పులేదు నాకిష్టం అయినపాటలు నేను పెట్టుకుంటే సౌండుతగ్గించాలా ?" అన్నాడు చిదంబరం కొంచెం కోపంగానే.

" అదేంటబ్బాయి భక్తి పాటలకీ నీ పిచ్చిపాటలకీ సాపత్యమా? అవి చెవినపడితే పుణ్యమూ పురుషార్థం-"

" ఇవిచెవిన పడితే పాపం తప్పు. నావి పిచ్చిపాటలు ఆ చెత్తపాటలు. మీకిష్టం అయినట్టే ఈపాటలు నాకు చాలా ఇష్టం. ఇదివింటే హేతువాదభావాలు,విప్లవభావాలు కలుగుతాయి "-

"పచ్చికమ్యూనిస్టులా మాట్లాడుతున్నావేంటి ?" అంటూ ఆ పక్కింటాయిన వచ్చాడు ఇంతసేపూ ఈ సంభాషణఅంతా వింటున్నాడు. మరొకిద్దరు ఆడవాళ్లు ఇరుగు పొరుగు గూడా చేరారు.

చిదంబరం ఒక్కడూ ఒకపక్క మిగతా అందరూ ఒకపక్క - మాటా మాటా పెరిగింది చివరికి ఎదురింటి ఇంగ్లీషులెక్చరరు భగవతిరావు వచ్చి ఇరుపక్షాలకి సర్దిచెప్పాక తగువు తాత్కాలికంగా సద్దుమణిగింది. చిదంబరం కాస్త సౌండుతగ్గించాడు. ఎండెక్కినమూలాన కోవెలలో భక్తి రికార్డులు ఆగి పోయాయి.

అనారోగ్యంతో బాధపడుతున్న ప్రకాశరావుకి కూడా మైకులో పాటలు భక్తిపాటలు కనుక - బాధకలిగించలేదు.లేదా- కలిగినా ఓర్చుకున్నాడు. కానీ వంగపండు, గద్దర్ పాటలు ఓర్చుకోలేకపోయాడు. సాయిబాబాను తిడుతూ పాడిన పాటను సాయిబాబా భక్తులుకానివాళ్లు కేవలం వినోదంగా కూడా వినలేరు సహించలేరు.

మర్నాడు చిదంబరం రూమ్మేటు రాంబ్రహ్మం వచ్చాడు అతనిది మాకవర పాలెం దగ్గర తామరం. చిదంబరానిది కొండలగ్రహారం. ఇద్దరూ చిన్నప్పటి నుంచీ స్నేహితులు. నర్సీపట్నంలో డిగ్రీ చదువుతున్నారు.

రాం(బహ్మం బీయే ఫైనల్ ఇయర్. చిదంబరం బికాం ఫైనల్ ఇయర్. ఐదు రోడ్ల జంక్షనుకు దగ్గర్లో రూంతీసుకొని అద్దెకుఉంటున్నారు. ఇద్దరూ కలసి వంట చేసుకొంటున్నారు. ఎవరి సైకిలువారికివుంది .

ఆ దగ్గరలో వినాయకుడిగుడి ఉంది. గుడికాదు మందిరంలా ఉంటుంది. రోజా ఉదయం నాలుగున్నర ప్రాంతం మంచి ఏడు గంటలదాక మైకు పెట్టి భక్తిగీతాలు అదరగొడతారు. అయ్యప్ప పాటలు, అమ్మవారి పాటలు ,భక్తిగీతాలు , భగవద్గీత, వెంకటేశ్వర సుప్రభాతం అదీ ఇదీ అని లేదు.హిందూ మతానికి సంబంధించిన సమస్త భక్తిగీతాలు వేస్తారు. ఒకోరోజు సాయంత్రం కూడ మైకుపెడతారు.

చిదంబరం, రాం(బహ్మం ఇద్దరికీ ఇంటర్మీడియట్ రోజుల్నించి వామపక్ష భావాలున్నాయి. విశాఖపట్నంలో జరిగిన అఖిలభారతవిద్యార్థిసంఘానికి వెళ్లివచ్చారు,సృజన, అరుణతార వంటి పత్రికలు చదువుతారు. సమగ్రంగా కాకున్నా, కొంతవరకూ మార్క్సిస్టు సిద్ధాంతంపై అవగాహనవుంది. అంబేద్కర్ భావాలు కూడా వంటపట్టించుకొన్నారు. ఆ గదిలో దేవుడు పటాలుండవు. ఒకగోడకి అల్లూరి సీతారామరాజు బొమ్మ, భగత్‌సింగు బొమ్మలుంటాయి. మరో గోడకి మార్క్స్‌ఏంగిల్స్‌లా బొమ్మలుంటాయి. తరుచూ సభలకి వెళ్లడం, కరపత్రాలు పంచడం వంటి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఫైనలియర్ కనుక అవితగ్గించి చదువు మీద దృష్టి పెట్టారు.

రెండురోజులతరువాత ఏడురోడ్లజంక్షన్‌లో కొత్తగా కట్టిన కిళ్లీబడ్డీ ప్రారంభోత్సవానికి మైకు పెట్టారు. ముందు శుక్లాం బరదరం వాతాపిగణపతింభజే వేసి, క్రమంగా కొత్తసినిమాలో పచ్చిశృంగార గీతాలు వేయడం ప్రారంభించారు. రాం(బహ్మంకి వళ్లుమండి ఆ బడ్డీకొట్టువాడితో తగువుకు దిగాడు తన్నుకునే వరకూ వచ్చింది. చిదంబరం - రాం(బహ్మాన్ని వెనక్కులాగి నలుగురు స్నేహితులను కూడా తీసుకువెళ్లి కంప్లయింటు ఇస్తానంటూ పోలీసు స్టేషనుకు బయలుదేరాడు.

" నీయిష్టం వచ్చింది చేసుకో. నాఈక తెంపలేవు -" అంటూ ఆ కొట్టువాడు నానా బూతులూ మాట్లాడాడు.

జూనియర్ కాలేజి పక్కనుంచి వెళ్తే అక్కడికి పోలీసు స్టేషను దగ్గరే. రాం(బహ్మం మరొక నలుగురైదుగురు స్నేహితులు కలిసి సర్కిల్ ఇన్స్‌పెక్టరుతో సంగతంతా చెప్పారు. అతనప్పుడు ఏజెన్సీకేంపునుంచి దిగాడు. నక్సలైట్ల గొడవల్లో తలమునకలై వున్నాడు. అతనిది వరంగల్లు హెడ్ కానిస్టేబులుగా ఎక్కువకాలం చేయకుండానే ఎన్‌కౌంటర్లు మీద ఎన్‌కౌంటర్లు చేసి ప్రమోషనుమీద సిఐ అయ్యాడు. ఎంఏ పాలిటిక్స్ చదివాడు బొద్దుమీసాలు ఎర్రగాకళ్లు భయంకరంగా వుంటాడు.

అసలు దీనికి ఇంత కంప్లైంటుదేనికని– అంటాడు. ఇదంతా మామూలుగా జరిగే కథ అంటాడు. రామబహ్మం ధైర్యంగా కాస్త గట్టిగానే వాదిండాడు " విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు మైకు పెట్టి మీటింగ్ పెడితే లాఠీ ఛార్జి చేస్తారు. పరీక్షల ముందు చదువుకోనివ్వకుండా వేళ పాళ లేకుండా మైకు పెడితే పట్టించుకోరు ఏమి సార్ - " అన్నాడు.

" కనీసం రూల్సు ఐనా పాటించండి సార్" అన్నాడు.

"చూస్తుంటే మీరు రాడికల్ లెక్కున్నరు" అన్నాడు సర్కిల్.

"చదువుకోడానికి మైకు వల్ల ఇబ్బందిగా వుందని కంప్లైంట్ ఇవ్వడానికి వస్తే రాడికల్స్ అంటారు ఏంటి సార్. పక్కంటిఆయనకు అనారోగ్యం నీరసం, నిద్రలేదు పాపం - కానిస్టేబిల్ని పంపించి కాస్త ఆ మైకు ఆపుచేయించండి. ఆ బడ్డీ కొట్టు వాడు మా మాట వినడం లేదు సార్- ".

సర్రు మన్నాడు సర్కిల్ ఇన్స్‌పెక్టర్. సబ్ ఇన్‌స్పెక్టర్ స్టేషన్‌లో లేడు.

" అట్టే ఎక్కువ తక్కువ మాట్లాడకు. మేము ఏమి చేయాలో మాకు బాగా తెలుసు. చూస్తాం లే పో -' అని కేకలు వేశాడు. తెలంగాణా యాసతో. ఆ కేకలు రామ(బహ్మం స్నేహితులకు భయం వేసి గబాగబా మెట్లు దిగి వెనక్కి వచ్చారు.

సరే నని చేసేది లేక నోరు మూసుకున్నారు. పరీక్షలు నిండా నెలరోజులు గూడా లేవు. ఇంటికి వచ్చాక ఆ చుట్టుప్రక్కల యువకుల్ని కూర్చోపెట్టి ధ్వని కాలుష్యం గురించి వివరంగా బోధపరిచాడు, రాంబ్రహ్మం.

భూస్వాముల వర్గం తన భావాలను ఇలాగే బలవంతంగా ప్రచారం చేసి ప్రజలు మీద రుద్దుతారు. ఈ నాటి పెట్టుబడి దారీ వర్గం వారి ఏజెంట్లు ఇప్పుడు ఆ పనే మైకుల ద్వారా చేస్తున్నారు. ఇది ధ్వని కాలుష్యం సమస్య మాత్రమే కాదు. వలసవాద పాలకవర్గ కుట్రపూరిత భావనలో భాగం. మనం దీనికి వ్యతిరేకంగా మార్క్సిస్ట్ భావాలను ప్రచారం చేస్తే ఒప్పుకోరు. అని వివరించాడు ఇవన్నీ 'వినే సరికి కొందరికైనా సంగతి బోధపడింది, మైకు పెట్టిన బడ్డీ కొట్టు వాడితో దెబ్బలాడడానికి ధైర్యం చాలలేదు. వాడు మైకు ఆపాడు కాదు.

ఆ మర్నాడు, ఆ పక్కనున్న తోటవీధిలో ఒక అమ్మాయి పెద్ద మనిషి అయ్యింది.

మైకు పెట్టి, రోడ్డుకి అడ్డంగా షామియానా వేశారు. అసలే అది సన్నటి సందు. షామియానా వేసేసరికి మెసల్దానిక్కూడా వల్లకానంత ఇరుగ్గా తయారయ్యింది. వాళ్లతో తగువుకి వెళ్లి ప్రయోజనం లేదు. ఆ చెత్త పాటలు వినపడకుండా రాంబ్రహ్మం వంగపండు పాటలు పెట్టాడు. చిదంబరానికి చాలా యిష్టమైన పాట అది–

జ్ఞానమొక్కడి సొత్తు కాదన్నా
అది సర్వజాతుల సంపదోరన్నా - అన్నా నరుడో ఇన్నావ నరుడా॥ జ్ఞాన మొక్కడి॥
లేని దేవుడు బొమ్మలోపల ఉన్నడన్నరు.
కాలునుండీ మాలవాడూ పుట్టెనన్నరు
చదువురాదని ఊరిబైట ఉండమన్నరు
మాలఐనా జాషువాకవి మహాకావ్యం రాయలేదా ॥జ్ఞాన॥
రాజనీతీ కులం హీనులు రాయరాదని
విష్ణు బుర్రలో పంతులేమో పుట్టినారు
రాజనీతులు రాయడానికి పెంచుకొన్నరు
చెప్పుదీసి కొట్టినట్టు తప్పుదీసి
కులంలేని అంబేద్కరు రాజ్యాంగం రాయలేదా ॥జ్ఞాన॥
మనువు రాసిన ధర్మశాస్త్రం మనది అన్నరు
గొప్పవాడూ తప్పుజేస్తే చెల్లునన్నరు
చిన్నవాడికి శిరచ్ఛేదం చెయ్యమన్నరు
కుమ్మరోడూ విక్రమార్కుని కుమ్మికుమ్మిసంపలేదా॥ జ్ఞాన॥

ఈ పాట ఫుల్‌సౌండ్‌తో పెట్టేసరికి పెద్దల్లోకలకలం బయల్దేరింది. ఆ పంతులుగారు వాళ్ల మేనకోడలే పెద్దమనిషయింది. ఇటువంటి వెధవపాటల్ని ప్రభుత్వం వెంటనే ఎందుకు నిషేధించలేదని నెత్తీనోరూ బాదుకున్నాడు. సనాతన ధర్మం మంట గలిసిపోతున్నదని వాపోయాడు.

పరీక్షల ముందు మైకు న్యూసెన్సు ఆపుచేయించమనీ, కనీసం రూల్సు ప్రకారం సమయం ఐనా పాటించేలా చూడమని సబ్‌కలక్టరుకీ, సర్కిల్ ఇన్‌స్పెక్టరుకీ, పంచాయితీ ప్రెసిడెంటుకీ కంప్లయిట్లిచ్చారు కుర్రాళ్లు. రాంబ్రహ్మం తనేరాసి, అందరి చేతా సంతకాలు చేయించాడు పంతులు కొడుకు శర్మ మరికొందరు జట్టుగాళ్లని వేసుకుని తగువుకొచ్చాడు. వీధి వీధంతా పెద్దగొడవయిపోయింది.

ఆ రాత్రి రాంబ్రహ్మం మళ్లీ ఆ పాటే పెట్టాడు. చివర చరణం వస్తున్నది.

గీత రాసిన శ్రీకృష్ణుని గీత జాడు
విశ్వసృష్టికి నేనెనంటూ చెప్పినోడు
విష్ణుచక్రం చేతిలోనా తిప్పినోడు
కాళీంద్రుని కాళ్లతోనీ తొక్కినోడు
బోయవాని అమ్ముదెబ్బకు బోర్లాపడి సావలేదా ॥అన్నా॥
జ్ఞాన మొక్కడి సొత్తుకాదన్నా॥

శర్మ పరుగెత్తుకొచ్చి ఈ వెధవ పాటలు ఆపుతావా లేదా అని కేకలు వెయ్యడం ప్రారంభించాడు. చాలా పెద్ద గొడవ జరిగింది. పోయిన చదువెలాగూపోయింది, తగువు తేల్చుకోవాలనుకున్నాడు రాంబ్రహ్మం.

మర్నాడు మైకుతీసేశారు. పంతులు– రాంబ్రహ్మం నక్సలైటు, కరపత్రాలు పంచు తున్నాడని పోలీసు కంప్లయింటు ఇచ్చాడు .

ఆ మర్నాడు రాంబ్రహ్మం పోలీసులొచ్చి తీసుకెళ్లారు. ఆ సమయనికి చిదంబరం రూంలో లేడు. లేకపోతే అతన్నీ లాక్కు పోయేవారే. చిదంబరం వెంటనే వైజాగ్ వెళ్లి లాయరు పీ.యల్. నాయుడుగార్ని లాక్కొచ్చాడు. మర్నాడు రాంబ్రహ్మం బెయిలు మీద బయటికొచ్చాడు. లాయరు గారి వెంట వచ్చిన పౌరహక్కుల నాయకుడు కృష్ణ- వీధిలో వాళ్లందరికీ గట్టి వార్నింగులిచ్చాడు. ఆ రోజు పంతులుగాని, అతని కొడుకుగాని పత్తాలేరు. అప్పట్నించీ ఆ వీధిలో పెద్ద సౌండుతో మైకు పెట్టాలంటే ఎవరికయినా కొంచెం జంకుగానే వుంటున్నది.

పరీక్షలు మరొక్కవారం రోజులే వున్నాయి. రాంబ్రహ్మం , చిదంబరం ప్రశాంతంగా చదువుకుంటున్నారు. కేవలం మైకు ఆపడంకోసం ఇంత యుద్ధం చెయ్యవలసివచ్చిందో.– అని ఆశ్చర్యపడ్డాడు. ఈ యుద్ధం వల్ల ఈ వ్యవస్థ యొక్క వర్గస్వభావం వాళ్లకి కొంతవరకూ అర్థమయింది.

*రచనా కాలం : 5-1-1996*